# అసలు రూపం

పి. సందీప్ కుమార్




**“రనిత్” పిలిచింది సునీత తన ప్రియుడైన రనిత్‌ని.**

**“ఏమిటీ?”**

**“నాతో అలా లుంబినీ పార్క్‌దాకా వస్తావా?”**

**“ఇప్పుడా ఏంటంత అర్జెంట్?” ప్రశ్నించాడు రనిత్ సునీతని. అలాగే సునీతని పరికించి చూశాడు. ఎందుకో సీరియస్‌గా వుండామె ముఖం.**

“నీకు ఇప్పుడేమీ క్లాసెస్ లేవా?” అడిగాడు మళ్ళీ తనే ఆమేమీ బదులివ్వకపోవటంతో.

“ఉన్నాయి కానీ వెళ్ళాలని లేదు. ప్లీజ్ నా మాట మన్నించు”

“సరే పద మాక్కూడా ఇప్పుడు ఎలాగూ లీజరే”

కాస్సేపటిలో వాళ్ళిద్దరూ లుంబినీ పార్క్‌లోని ఓ సిమెంట్ బెంచీపై కూర్చుని వున్నారు.

“ఇప్పుడు చెప్పు వాటీజ్ యువర్ ప్రాబ్లమ్?” అడిగాడు సునీత భుజంపై చేయి వేసి అనునయంగా.

“నాకు పిరీడ్స్ అవటం లేదు” సిగ్గుగా అంది ఆ మాట సునీత.

“అయితే?” రనిత్‌కేం అర్థం అవటం లేదు.

“నేను కన్సీవ్ అయ్యానేమోనని అనుమానంగా వుంది” అసలు విషయం బైట పెట్టింది సునీత.

“వాట్?” అదిరిపడ్డాడు రనిత్.

“అవును రనిత్. ఈ మధ్య ఏం తినాలనిపించటం లేదు. ఒకవేళ తిన్నా అంతా వామ్టింగ్ అవుతోంది.”

“డౌట్ లేదు. నువ్వు ప్రెగ్నెంట్‌వని కన్‌ఫార్మ్ అయింది” సన్నగా ఏడుస్తోంది సునీత.

“ఏంటీ ఏడుస్తున్నావా? డోంట్ వీప్ సునీత” ఓదార్పుగా తల నిమరసాగాడు రనిత్.

“నాకెందుకో భయంగా వుంది రనిత్” అంది సునిత ఏడుస్తూనే.

“కానీ కానీ ఇదంతా ఎలా?” అంతా అయోమయంగా వుంది రనిత్‌కి.

“ఒక నెల ముందు నన్ను మీ గెస్ట్ హౌస్‌కి రాత్రిపూట తీసుకెళ్ళావు గుర్తుందా?”

స్మృతిపథంలో వెనక్కి వెళ్ళిన రనిత్ ‘వూ’ అన్నాడు జవాబుగా.

“అప్పుడు నువ్వు విస్కీ డ్రింక్ చేశావ్. నాకూ బలవంతంగా తాగించావ్. అప్పుడు ఆ మైకంలో. ఆ మత్తులో ఏమీ చేస్తున్నామో తెలియని తనంతో మనిమిద్దరం ఒకటయ్యాం.”

“అలాగా” అంతా లీలగా గుర్తుకు రాసాగింది రనిత్‌కి. తనకు మాత్రం సునీతకు తాగించినంత వరకే గుర్తుంది.

ఆమె రోదన శబ్దం వినబడటంతో ఆలోచనల్లోంచి బయటపడ్డాడు రనిత్.

“ఊరుకో.. కంట్రోల్ యువర్‌సెల్ఫ్”

“ఇప్పుడేమి చేయమంటావ్ రనిత్” అడిగింది సునీత విషాదవదనంతో.

“అబార్షన్ చేయించుకో”

“రనిత్” నిశ్చేష్టురాలయ్యింది ఆ మాటకి సునీత.

“అవును సునీత.. ఏదో వయసు వేడిలో తప్పు చేసేశాం. దానికి రిజల్టే కడుపు. ఎవ్వరికీ విషయం తెలియకముందే గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్ చేయించుకో. డబ్బులు నేనిస్తాను. నేనా రిచ్ ఫేమిలీకి చెందినవాణ్ణి. నువ్వా మిడిల్‌క్లాస్ ఫేమిలీకి చెందినదానివి. ఎలాగూ మన పెళ్ళికి మా పెరెంట్స్ ఒప్పుకోరు.” ఆ అపురూపమైన అందం తన సొంతమైనందుకు లోలోపల సంబరపడుతూనే పైకి మాత్రం బాధ నటించసాగాడు రనిత్.

“ఈ బుద్ధి నన్ను ప్రేమించానని వెంటపడినప్పుడు లేదా? నన్ను గెస్ట్‌హౌస్‌కి తీసుకెళ్ళి ఎంజాయ్ చేసినప్పుడు లేదా?” బాధతో కూడిన ఉక్రోషంతో ప్రశ్నించింది సునీత.

‘అవును నాకు బుద్ధి లేదు. అసలు నీ ప్రెగ్నెన్సీకి నేనే బాధ్యుణ్ణి అన్న గ్యారెంటీ ఏమిటీ? మనిద్దరి రిలేషన్ గురించి మనకు తప్ప మన ఫ్రెండ్స్‌కి కూడా తెలీదు” అని “ఇంకెప్పుడూ నన్ను మీటవడానికి ట్రయ్ చేయకు. గుడ్ బాయ్” అని వెళుతున్న రనిత్ చప్పట్ల శబ్దానికి వెనుతిరిగి చూశాడు. అంతే నిర్ఘాంతపోయాడు. కారణం సునీత ప్రక్కనే వున్న ఫ్రెండ్ అనిత. ఇద్దరూ నవ్వుతూ తనవైపు చూస్తున్నారు.

“వెల్ మిస్టర్ రనిత్. నీ అసలు రూపం బయటపడింది. మేం పెట్టిన టెస్ట్‌లో నువ్వు ఘోరంగా ఫెయిలయ్యావు” అంది వెటకారంగా అనిత. “ఏమిటి మీరంటున్నది?” అడిగాడు. కోపంగా రనిత్.

“అవును రనిత్. నీ గురించి నా ఫ్రెండ్ ఎప్పుడో చెప్పింది. కానీ నేను నమ్మలేదు. నన్ను నమ్మించటం కోసం తనే ఒక పథకం రూపొందించి, నీ అసలు రూపం మాకు.. సారీ నాకు తెలిసేలా చేసింది. ఆ రోజు అనిత ప్రోద్బలం మీదనే నీతో గెస్ట్‌హౌస్‌కి వచ్చాను. మనల్ని ఫాలో చేసింది కూడా. అదే నువ్విచ్చిన విస్కీ నేను తాగలేదు. తాగినట్లు నటించా. ఆ తాగిన మైకంలో నా నటనను నిజమని నమ్మావ్. ఇప్పుడూ నేను నీతో చెప్పినదంతా కూడా ఉత్త అబద్ధమే. లేకపోతే నన్ను చీట్ చేయాలని చూస్తావా? నేను ప్రెగ్నంట్‌నీ కాను, నువ్వు నన్ను తల్లినీ చేయలేదు. అంతా డ్రామానే” అని సునీత “థ్యాంక్స్.. ఈ కిరాతకుడి నుంచి నన్ను తప్పించావ్” అంది అనితతో.

“ఇట్స్ మై ప్లజర్” అంది అనిత నవ్వుతూ.

ఆ ఇరువురి స్నేహితురాళ్ళ తెలివితేటలకు తెల్లబోయాడు మోసగాడు రనిత్. ✲